రోడ్లు, కల్వర్టు మరమ్మతులకు రూ.2500 కోట్లు

- యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలి : మంత్రి ప్రశాంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో రోడ్లు అద్దంలా ఉండాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశించారని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తు చేశారు. ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బి కార్యాలయంలో అన్ని జిల్లాల ఎస్‌ఇలు, ఇఇలతో మంత్రి వేముల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత రెండు సీజన్లలో అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలనీ, వారు ప్రతిపాదించిన రోడ్లను పరిగణనలోకి తీసుకుని బాగు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాధారణ పునరుద్ధరణ, వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్ల కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ రూ. 2,500 కోట్లు మంజూరు చేశారని ప్రకటించారు. ఈ నెల 15 లోపు టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. కెసిఆర్ ఆదేశాల ప్రకారం వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల పునరుద్ధరణ పనులు వేగంగా నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రోడ్లు భవనాలు శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, ఇంజినీర్ ఇన్ చీఫ్ రవీందర్‌రావు పలువురు ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

10న మంత్రివర్గ సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 10న జరగనుంది. ప్రగతిభవన్‌లో మధ్యాహ్నం 2గంటలకు ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన జరిగే కేబినెట్ సమావేశంలో ధాన్యం కొనుగోలు, రైతుబంధు నిధుల విడుదల, సొంతజాగా ఉన్న వారికి గృహనిర్మాణానికి ఆర్థిక సహాయం, దళిత బంధు అమలు, తదితర అభివృద్ధి సంక్షేమ పథకాలపై మంత్రివర్గం చర్చించనుంది. టిఆర్ఎస్ నేతల టార్గెట్‌గా జరుగుతున్న సిబిఐ, ఇడి దాడులపై కూడా సిఎం కెసిఆర్ స్పందించనున్నారు. బిజెపి జిమ్ముక్కులకు ఎదురొడ్డి నిలవాలని, తెలంగాణ గడ్డపై కాషాయ నాటకాలు సాగవని చెప్పేవిధంగా సిఎం కెసిఆర్ మంత్రివర్గ సహచరులకు దిశానిర్దేశం చేయనున్నారు.

సంక్షోభంలో ఉన్నత విద్య

- కుంటుపడ్డ సైన్స్ పరిశోధనలు
- మళ్లీ మనుధర్మంలోకి నెట్టేలా విద్యావిధానం
- జ్ఞానాభివృద్ధికి బిజెపి వ్యతిరేకం : ప్రొఫెసర్ హరగోపాల్
- రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా నూతన విద్యావిధానం
- పెద్ద వ్యాపారంగా ప్రాథమిక విద్య
- ఎస్ఎఫ్ఐ సెమినార్‌లో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సెమినార్‌లో మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
దేశంలో ఉన్నత విద్య మరింత సంక్షోభంలోకి నెట్టబడుతోందని ప్రొఫెసర్ జి హరగోపాల్ అన్నారు. ఎస్ఎఫ్ఐ 17వ జాతీయ మహాసభలను పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఉన్నత విద్య-నూతన విద్యావిధానం-2020' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. కరికులమ్ మార్పు పేరుతో మనుధర్మశాస్త్రాన్ని అందరిమీదా రుద్దే ప్రయత్నం జరుగుతున్నదని ఆందోళన వెలిబుచ్చారు. దళితులకు, మహిళలకు విద్య అవసరం లేదనీ, జ్ఞానాభివృద్ధికి వ్యతిరేకమైన పార్టీ నేడు కేంద్రంలో అధికారంలో ఉందని వాపోయారు. దిగువ సామాజిక తరగతుల వారి పిల్లలు సైంటిస్టులుగా ఎదగటం నేటి పాలకులు ఇష్టం లేదని విమర్శించారు. ఉన్నత విద్యకు గ్రాంట్లు తగ్గటం వల్ల సైన్స్ పరిశోధనలు కుంటుపడ్డాయని ఆందోళన వెలిబుచ్చారు. ఎనిమిదో తరగతిలోనే డ్రాపౌట్ కావొచ్చనీ, చదువు నుంచి తప్పుకున్న ఆ పిల్లలు తన తండ్రి చేసే కులవృత్తిలో శిక్షణ పొందాలని నూతన విద్యావిధానంలో చెప్పటం దారుణమని విమర్శించారు. 200 విశ్వవిద్యాలయాల్లో స్కాలర్‌షిప్పులు తగ్గించటం పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడమేనన్నారు. విదేశీ యూనివర్సిటీల కోసం ఉన్నతవిద్యను నాలుగేండ్లకు కుదించారని తెలిపారు. జ్ఞానాన్ని అర్జించే కాలాన్ని తగ్గించడం దుర్మార్గామన్నారు. సబ్జెక్టుల మీద పట్టు లేకపోతే పిహెచ్‌డిలు సమగ్రంగా ఎలా చేయగలరని ప్రశ్నించారు. యూనివర్సిటీల్లో భావఘర్షణ తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం ఫాసిజం వైపు వెళ్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అడ్మిషన్ల కోసం పరీక్షలను సెంట్రలైజ్డ్ చేయడం వల్ల ప్రాంతీయ భాషల్లో చదువుకునే విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదనీ, దీనివల్ల విద్యార్థులు మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలూ ఉన్నాయని వివరించారు. విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు.

'ప్రాథమిక విద్య-నూతన జాతీయ విద్యావిధానం' అనే అంశంపై ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ...ప్రపంచబ్యాంకు, కార్పొరేట్ సంస్థలకు మేం గులాంగురి చేస్తాం.. ప్రజలు మాకు బానిసలుగా ఉంటారన్నట్టుగా కేంద్రంలోని పాలకులు నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చినట్టు ఉందని విమర్శించారు. మన దేశ సామాజిక, ఆర్థిక, సంస్కృతిక అంతరాలను తొలగించేలా, రాజ్యాంగ విలువలకు అనుగుణంగా అది ఉండాలని ఆకాంక్షించారు. గుణాత్మక విద్యను అందించే విద్యావిధానం ఉండాలని డాక్టర్ కొఠారి కమిషన్ సూచించడాన్ని గుర్తుచేశారు. ప్రపంచానికి అవసరమైన స్కిల్డ్ లేబర్‌ను తయారు చేసే కేంద్రంగా మార్చి ప్రపంచ దేశాలకు కూలీలను అందిస్తామన్నట్టుగా మోడీ సర్కారు తీసుకొచ్చిన ప్రస్తుత నూతన విద్యావిధానం ఉందని విమర్శించారు. గతంలో 10+2+3 విద్యావిధానం ఉండేదనీ, ప్రస్తుతం దాన్ని 5+3+3+2+4 ప్రతిపాదించడం దారుణమని అన్నారు. ఇంటర్ విద్య కంటే పూర్వప్రాథమిక విద్య పెద్ద వ్యాపారంగా మారిందని వివరించారు. ఒకటో క్లాసు వరకు నాలుగు తరగతులు చదవాల్సి వస్తున్నదని చెప్పారు. కార్పొరేట్లకు కాసులు కురిపిస్తున్న ఆ ప్రీప్రైమరీ విద్యను చట్టబద్ధం చేసేందుకు కేంద్రం తీసుకొచ్చిన విద్యావిధానం దోహదపడుతుందని విమర్శించారు. దేశంలోని 60 శాతం పిల్లలు ఉండాల్సిన బరువు, ఎత్తు లేరని వివరించారు. తిండి సరిగ్గా తింటేనే ఆరోగ్యంగా ఉండి మంచిగా చదువుకోగలుగుతారని చెప్పారు. కానీ, దాని గురించి ఎక్కడా సరిగా లేదన్నారు. 3-8 ఏండ్లలో 90 శాతం మెదడు అభివృద్ధి చెందుతుందని, మన దేశంలో నూటికి 60 శాతం పిల్లలకు సరైన తిండి లేదన్నారు. వీరంతా కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకోగలుగుతారా? అని ప్రశ్నించారు. విద్యకు బడ్జెట్‌లో నెహ్రూకాలంలో 4.5 దాకా కేటాయిస్తే మోడీ సర్కారు దాన్ని 2.7 శాతానికి కుదించిందని విమర్శించారు. కరోనా పేరుతో కరికులం నుంచి ప్రజాస్వామ్యం అనే పాఠాన్ని తీసేయటం దారుణమన్నారు. దేశంలో పెరుగుతున్న సాంఘిక,ఆర్థిక అసమానతలు అనే పాఠాన్నీ తొలగించారన్నారు. ఓవైపు దేశాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్లేలా కరికులమ్‌లో మార్పులు చేస్తున్నారనీ, ఇంకోవైపు విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేటు పరం చేసే కుట్రకు పూనుకున్నారని విమర్శించారు. అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం లేదనీ, టీచర్ల పోస్టులు భర్తీ చేయడం లేదని తెలిపారు. ఈ సెమినార్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు, ఉపాధ్యక్షులు ఎం పూజ, శంకర్, రజనీకాంత్, బషీర్, సహాయ కార్యదర్శులు అశోక్‌రెడ్డి, కిరణ్, వీరభద్రం, మిస్రీన్ సుల్తానా పాల్గొన్నారు.

ఆర్ఎంసి నివేదికను నిలిపేయాలి

- కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసి) నివేదికలోని అంశాలు తమకు ఆమోదయోగ్యం కాదని, ఆనివేదికను నిలిపేయాలని తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)ను కోరింది. దీనికి సంబంధించి మీడియాకు సరైన వివరణ ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ ఇరిగేషన్ శాఖ స్పెషల్ సిఎస్ డా రజత్ కుమార్ సోమవారం కృష్ణాబోర్డు చైర్మన్‌కు లేఖరాశారు.కెఆర్ఎంబి, ఆర్ఎంసి భేటి సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ సభ్యులు హాజరుకాలేదు. ఎపి అధికారులు వచ్చారు. జలవిద్యుత్ ఉత్పత్తి, వరద జలాల వినియోగంపై చర్చ, రూల్ కర్వ్ కోసం సిఫారసులతో కూడిన ముసాయిదా నివేదికపై చర్చించేందుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి), రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసి) భేటి చోటుచేసుకుంది. కన్వీనర్ రవికుమార్ పిళ్లై నేతృత్వంలో నిర్వహించిన ఈ భేటికి ఎపి నుంచి ఇంజినీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డి హాజరయ్యారు. నివేదికపై ఎపి సభ్యుల సంతకాలు తీసుకున్న ఆర్ఎంసి, కెఆర్ఎంబికి నివేదిక సమర్పించనుంది.


ఆత్మహత్యాయత్నం చేస్తున్న బాధితుడ్ని అడ్డుకుంటున్న కలెక్టరేట్ సిబ్బంది

పింఛను కోసం వికలాంగుని ఆత్మహత్యాయత్నం

- యాదాద్రి కలెక్టరేట్లో ఘటన
- కొడుకు పేరున ట్రాక్టర్ ఉందని పింఛను రద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కొడుకు పేరున ట్రాక్టర్ ఉందని వికలాంగుని పింఛన్ రద్దు చేయడంతో బాధితుడు కలెక్టరేట్‌కు వచ్చి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో జరిగింది. సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. భువనగిరి మండలం హన్మాపురం గ్రామానికి చెందిన నాగపురి యాదగిరికి మునుగోడు ఉప ఎన్నికల ముందు ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసింది. సెప్టెంబర్ నెల మాత్రమే పింఛన్ ఇచ్చారు. అక్టోబర్ నుంచి ఇవ్వడం లేదు. భువనగిరి ఎంపిడిఒ గుత్తా నరేందర్‌రెడ్డిని సంప్రదించాడు. బాధితుని కొడుకు నాగపురి వినోద్ పేరు మీద ట్రాక్టర్ ఉందని, అందుచేత నిబంధనలకు లోబడి పింఛన్ రద్దు అయినట్టు ఎంపిడిఒ చెప్పారు. యాదగిరి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టరేట్‌కు వచ్చాడు. కలెక్టర్ సమక్షంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కార్యాలయ సిబ్బంది సహకారంతో పోలీసులు బాధితున్ని అడ్డుకున్నారు. పింఛన్ కోసం ఇప్పటికే పలుమార్లు డిఆర్‌డిఒ మందడి ఉపేందర్ రెడ్డి, ఎంపిడిఒ నరేందర్ రెడ్డిని కలిసినా ఫలితం లేకుండా పోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

రూ. 50వేలు లంచం తీసుకుంటూ..

ఎసిబికి చిక్కిన తాండూరు సబ్ రిజిస్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
వికారాబాద్ జిల్లా తాండూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఎసిబి అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బాధితుని నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటూ సబ్ రిజిస్టర్ జమీరుద్దీన్ అధికారులకు పట్టుబడ్డారు. ఎసిబి డిఎస్‌పి సూర్యనారాయణ తెలిపిన కథనం ప్రకారం.. తాండూర్ పట్టణానికి చెందిన ఇర్షద్ 2019లో యాలాల మండలంకు చెందిన ఈర్యా నాయక్‌కు రూ.ఐదు లక్షల అప్పు ఇచ్చారు. ఇందుకు ఈర్యా నాయక్ ధౌలాపూర్ గ్రామానికి చెందిన భూమిని గ్యారెంటీగా పెట్టి ఈర్షద్‌కు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. ఇర్షద్‌కు ఈర్యానాయక్ తిరిగి డబ్బులు చెల్లించాడు. రిజిస్ట్రేషన్ చేసిన భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ రద్దు చేయించుకునేందుకు తాండూరు సబ్ రిజిస్టార్‌ను ఆశ్రయించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంటును రద్దు చేసేందుకు తాండూరు సబ్ రిజిస్టర్ జమ్మిరోద్దీన్ రూ.లక్ష లంచం కావాలని డిమాండ్ చేశాడు. దాంతో ఈర్షద్ ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. సోమవారం మధ్యాహ్నం తాండూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ దగ్గర పనిచేస్తున్న జహీరుద్దీన్‌కు డబ్బు అప్పజెప్పాలని తెలిపారు. బాధితుడు అతనికి డబ్బులు ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. పూర్తి విచారణ జరిపి తాండూరు సబ్ రిజిస్టర్ జమిరుద్దీన్‌ను ఎసిబి కోర్టులో ప్రవేశపెడుతామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఎసిబి డిఎస్‌పి సూచించారు.


సబ్ రిజిస్టర్ జమీరుద్దీన్


శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతున్న తమ్మినేని

రేంజర్ శ్రీనివాసరావు కుటుంబానికి తమ్మినేని పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఇటీవల మృతిచెందిన రేంజర్ చలమల శ్రీనివాస్‌రావు కుటుంబాన్ని సోమవారం సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పరామర్శించారు. శ్రీనివాసరావు స్వగ్రామమైన ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఇర్లపూడి గ్రామానికి వెళ్లిన తమ్మినేని.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శ్రీనివాసరావు మామ డాక్టర్ ఎం.రామనాథంనీ పరామర్శించారు. శ్రీనివాసరావు మృతి వారి కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. ఆయన విధి నిర్వహణలో నిబద్ధత కలిగిన అధికారిగా పేరు పొందారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంచే మెడల్ సంపాదించి ఆయన పేరు ప్రఖ్యాతులు సంపాదించారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్య వీరభద్రం, రఘునాథపాలెం మండల కార్యదర్శి, ఎస్ నవీన్ రెడ్డి, రైతు సంఘం మండల నాయకులు బానోతు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు కాపర్తి రవీందర్, జూలూరుపాడు మండలం పార్టీ కార్యదర్శి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

నాట్కోకు ఢిల్లీ హైకోర్టులో ఊరట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రముఖ ఔషధ కంపెనీ నాట్కో ఫార్మా లిమిటెడ్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. నాట్కోకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను ద్విసభ్య ధర్మాసనం సోమవారం కొట్టివేసింది. ఎఫ్ఎంసి ఇండియా పేటెంట్‌ను నాట్కో క్లోరంట్రనిలిప్రోల్ (సిటిపిఆర్) విధానం ఉల్లంఘించలేదని హైకోర్టు తీర్పు ప్రకటించినట్లు నాట్కో కంపెనీ సెక్రటరీ సిహెచ్ వెంకట్ రమేశ్ తెలిపారు.

సిరిసిల్ల నేతన్నల నైపుణ్యం

- అబ్బురపడిన అమెరికా చేనేత నిపుణురాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సిరిసిల్ల నేతన్నల నైపుణ్యానికి అమెరికా చేనేత నిపుణురాలు అబ్బురపడ్డారు. అమెరికాకు చెందిన చేనేత నైపుణ్య నిపుణురాలు క్యారా జాఫ్ సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించారు. అమెరికా ప్రభుత్వ పరిశోధన గ్రాండ్‌తో ఆసియా ఖండంలోని వివిధ దేశాల్లో చేనేత పరిస్థితులు.. నైపుణ్యం వంటి అంశాలపై సమగ్రమైన అధ్యయనం చేస్తున్న కైరా సిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. ఇప్పటికే పలు దేశాల్లో ఉన్న పరిస్థితులపైన ముఖ్యంగా అక్కడి చేనేత పరిశ్రమపై ఆమె అధ్యయనాన్ని పూర్తిచేసుకున్నారు. భారత దేశంలో తెలంగాణతోపాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో తన అధ్యయనాన్ని కొనసాగించనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని చేనేత కార్మిక క్షేత్రాలైన పోచంపల్లి, గద్వాల్, ఎస్ఎస్ సిరిసిల్ల, సిద్దిపేట, జనగామ వంటి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. సిరిసిల్ల పట్టణంలో ఉన్న పలువురు చేనేత కార్మికుల మగ్గాలను, నేస్తున్న బట్టలను, వారి చేనేత నైపుణ్యాలకు సంబంధించిన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేనేత కళ నుంచి మరమగ్గాలవైపు సిరిసిల్ల నేతన్నలు మళ్లిన చారిత్రాత్మక క్రమంపైనా ఆమె వివరాలు సేకరించారు. అనంతరం వినూత్నమైన చేనేత ఉత్పత్తులతో దేశవ్యాప్తంగా ప్రచారంలోకి వచ్చిన హరిప్రసాద్‌ను కలిశారు. ఆయన రూపొందించిన వివిధ చేనేత ఉత్పత్తులను ముఖ్యంగా అగ్గిపెట్టెలో పట్టేలా నేసిన చీరను చూసి ఆమె అబ్బురపడ్డారు. అద్భుతమైన ప్రతిభానైపుణ్యం కలిగిన చేనేత కార్మికులను ఇంతవరకు తాను చూడలేదని చెప్పారు. సిరిసిల్ల పట్టణంలో ఉన్న చేనేత కార్మికుల నైపుణ్యంతోపాటు ఒక పవర్ లూమ్ క్లస్టర్‌గా మారిన తీరుపట్ల హర్షం వ్యక్తం చేశారు. సంక్షోభం నుంచి, నేతన్నలు స్వయం సమృద్ధివైపు సాగుతుండటాన్ని పరిశీలించారు. ఈ క్షేత్ర పరిశీలనలో ఆమె వెంట తెలంగాణ మరమగ్గాలు, జౌళి అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షులు గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తదితరులు ఉన్నారు.

నేటి విచారణకు హాజరు కాలేను..

- 11వ తేదీ తర్వాత అందుబాటులో ఉంటా...
- సిబిఐకి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ముందే ఖరారైన కార్యక్రమాల వల్ల మంగళవారం సిబిఐ చేపట్టాలనుకున్న విచారణకు తాను హాజరు కాలేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. 'ఈ నెల 11, 12, 14, 15 తేదీల్లో మీకు (సిబిఐకి) అనువుగా ఉన్న ఏదైనా ఒకరోజు హైదరాబాద్‌లోని నా నివాసంలో సమావేశం కావడానికి అందుబాటులో ఉంటా...' అని ఆమె స్పష్టం చేశారు. ఆ తేదీనీ త్వరగా ఖరారు చేయాలంటూ కోరారు. ఈ మేరకు సోమవారం సిబిఐకి ఆమె లేఖ రాశారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు సంబంధించిన కేసులో సిబిఐ తన వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ఎఫ్ఐఆర్ కాపీని క్షుణ్ణంగా పరిశీలించానని కవిత ఈ సందర్భంగా పేర్కొన్నారు. అందులోని నిందితుల జాబితానూ చూశానని వివరించారు. ఆ జాబితాలో తన పేరు ఎక్కడా లేదని తెలిపారు. ఈ కేసులో క్లారిఫికేషన్ కోసం సిబిఐ ఇచ్చిన నోటీసులపై ఆమె స్పందించిన విషయం తెలిసిందే. ఫిర్యాదు కాపీతోపాటు దాని ఆధారంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని తనకు అందించాలని కోరుతూ సిబిఐకి కవిత లేఖ రాసిన విషయం విదితమే. స్పందించిన సిబిఐ అధికారులు ఈ-మెయిల్ ద్వారా సమాధానం ఇస్తూ ఎఫ్ఐఆర్ కాపీ వెబ్‌సైట్‌లో ఉందంటూ తెలిపారు. ఈ క్రమంలో ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న నిందితుల పేర్లతో సహా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించానని ఆమె వివరించారు. అందులో తన పేరు ఎక్కడా లేదని పేర్కొంటూ సిబిఐ అధికారి రాఘవేంద్ర వస్తకు లేఖ రాశారు. తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తిననీ, దర్యాప్తునకు సహకరిస్తానని తెలిపారు. అందుకనుగుణంగా 11,12,14,15 తేదీల్లో ఏదో ఒకరోజు సీబీఐ అధికారులతో సమావేశమవుతానని స్పష్టం చేశారు.

తెలుగు నాటక రంగం పూర్వవైభవం పొందాలి

ప్రజాశక్తి - కల్చరల్ : చాట్ల శ్రీరాములు, గరిమెళ్ళ శ్రీరామ మూర్తి వంటి మహామహులు తెలుగు నాటక రంగాన్ని ఉన్నత స్థాయిలో నిలిపారని..నాటకం అట్టి పూర్వ వైభవాన్ని పొందాలని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై రస రంజని ప్రముఖ నాటక సంస్థ నిర్వహణలో రంగస్థల ప్రయోక్తలు గరిమెళ్ళ శ్రీరామమూర్తి, చాట్ల శ్రీరాములు జయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్, రస రంజనిల చాట్ల ప్రతిభా పురస్కారాన్ని సినీ నటుడు నిట్టల శ్రీరామ మూర్తికి, గరిమెళ్ళ శ్రీ రామమూర్తి పురస్కారాన్ని రంగస్థల పురస్కారం నటి అన్నలూరి కల్యాణికి బహుకరించి మాట్లాడారు. చాట్ల, గరిమెళ్ళ రసరంజని సంస్థ స్థాపనలో కీలక పాత్ర పోషించారని వివరించారు. నటనలో నిట్టల, కల్యాణి తమ కంటూ ప్రత్యేక ముద్ర వేసుకొన్నారని అభినందించారు. సాహితీ వేత్త వోలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన సభలో భాషా సాంస్కృతిక శాఖా సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, నటులు సుబ్బరాయ శర్మ తదితరులు పాల్గొన్నారు. కార్యదర్శి ముట్నూరి కామేశ్వరరావు నివేదిక సమర్పించారు.

పాలనాదక్షత ప్రతిభకు ప్రతీక సుబ్రహ్మణ్య శర్మ

ప్రజాశక్తి - కల్చరల్ : ఏ పదవిని చేపట్టినా పాలనా దక్షత ప్రతిభకు ప్రతీకగా సుబ్రహ్మణ్య శర్మ నిలిచారని కేంద్ర హోం శాఖ పూర్వ కార్యదర్శి కె.పద్మనాభయ్య కొనియాడారు. రసమయి సంస్కృతిక సంస్థ నిర్వహణలో ప్రభుత్వ విశ్రాంత ఉన్నతాధికారి సామాజిక తత్వవేత్త డాక్టర్ పీ.ఎల్.సంజీవ రెడ్డి 82 వ జయంతి సభ రవీంద్రభారతి లోని సమావేశ మందిరంలో జరిగింది. ముఖ్య అతిథిగా పద్మనాభయ్య పాల్గొని సంజీవ రెడ్డి స్మారక పురస్కారాన్ని ప్రసార భారతి విశ్రాంత ముఖ్య పాలనాధికారి సుబ్రమణ్య శర్మకు బహుకరించి మాట్లాడారు. సంజీవ రెడ్డి ఆర్థిక శాస్త్ర నిపుణుడుగా దేశానికి సేవచేశారన్నారు. పాలనా రంగానికి సంబంధించి పలు గ్రంధాలు రాసారని అవి నేటి సివిల్ సర్వీస్ ఉద్యోగులకు మార్గదర్శనం అని తెలిపారు. ఆదాయ పన్నుల శాఖ విశ్రాంత ప్రధాన కమిషనర్ నరసింహప్ప మాట్లాడుతూ సమాచార రంగంలో సమాచార భారతి అధికారిగా శర్మ సంచలనాత్మక మార్పులు తీసుకువచ్చారని వివరించారు. కరీంనగర్ కలెక్టర్‌గా బదిలీ అయిన సమయంలో ఆ బదిలీ రద్దు చేయాలని కమ్యూనిస్టు నాయకుడు చంద్ర పుల్లా రెడ్డి డిమాండ్ చేయటం శర్మ ప్రజల మనిషి అనేందుకు నిదర్శనమన్నారు. డాక్టర్ ఎమ్ కె రాము స్వాగతం పలికిన సభకు నాబార్డ్ విశ్రాంత చైర్మన్ కోటయ్య అధ్యక్షత వహించారు.

స్కూలు బస్సు బోల్తా..

- 16 మంది విద్యార్థులకు గాయాలు
- బిజిలీపూర్ శివారు వద్ద ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
డ్రైవర్ అతివేగం కారణంగా ఓ స్కూలు బస్సు బోల్తాపడిన ఘటనలో 16 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం బిజిలిపూర్ శివారులో సోమవారం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూలుకు పల్వట్లకు చెందిన 11 మంది విద్యార్థులు, మరువెల్లికి చెందిన ఆరుగురు విద్యార్థులతో స్కూల్ బస్సు బిజిలీపూర్ మీదుగా వెళ్తోంది. డ్రైవర్ కాస్త ఆలస్యంగా బస్సు తీయడంతో.. సకాలంలో పిల్లలను పాఠశాలలో చేర్చాలనే ఉద్దేశంతో అతివేగంగా నడిపాడు. ఈ క్రమంలో బిజిలిపూర్ సరిహద్దు వద్ద క్రాస్ రోడ్డు ఉండటంతో బస్సు కంట్రోల్ తప్పి బోల్తా పడింది. దాంతో బస్సులోని విద్యార్థులందరికీ గాయాలయ్యాయి. బలమైన గాయాలు తగిలిన నరసింహులుకు సంగారెడ్డిలోని చరిత హాస్పిటల్‌లో చికిత్సలో అందిస్తున్నారు. స్వల్ప గాయాలయిన వారికి ప్రథమ చికిత్స అందించి డిశ్చార్జ్ చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రాధా బాయ్, డిప్యూటీ తహసీల్దార్ చంబి రెడ్డి స్థానిక ఎస్ఐ అంబర్యా ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు.

స్పందించని విద్యాధికారులు, పాఠశాల యాజమాన్యం

ఇంతటి ఘోరమైన ఘటన జరిగినప్పటికీ అటు విద్యాశాఖ అధికారి గానీ, ఇటు పాఠశాల యాజమాన్యం గానీ కనీసం పట్టించుకోవట్లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కనీసం క్షతగాత్రులనైనా పరామర్శించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిట్నెస్ లేని బస్సులను నడపడం వల్లనే ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అనంతరం జోగిపేట పోలీస్ స్టేషన్‌లో పాఠశాల యజమాన్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.



వైద్య క్యాంపులో మాట్లాడుతున్న మల్లు అరుణ్‌కుమార్

ఎంవిఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

ఉచిత మోకాలి చిప్ప మార్పిడి ఆపరేషన్

- వైద్య క్యాంపును నిర్వహించడం అభినందనీయం
- ఐఎంఎ నీలగిరి అధ్యక్షులు డాక్టర్ సుచరిత
- ప్రతి ఏడాదీ ఉచిత ఆర్థోపెటిక్ చికిత్స క్యాంపు : డా. మల్లు అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మల్లు వెంకటనర్సింహారెడ్డి 18వ వర్ధంతి సందర్భంగా ఓ వ్యక్తికి మోకాలి చిప్ప మార్పిడి ఆపరేషన్ ఉచితంగా నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నీలగిరి ఐఎంఎ సహకారంతో సోమవారం సత్యవతి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆర్థోపెటిక్ వైద్య క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి అధ్యక్షులు డాక్టర్ సుచరిత ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఉచిత ఆర్థోపెటిక్ మెడికల్ క్యాంపు నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఇలాంటి క్యాంపులకు ప్రతీ ఒక్కరూ ముందుండి సహకరించాలని కోరారు. ట్రస్ట్ చైర్మెన్ అక్కెనపల్లి మీనయ్య మాట్లాడుతూ.. ఎంవిఎన్ ట్రస్టు ద్వారా ఇప్పటివరకు అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని విజ్ఞాన కేంద్రంలో లైబ్రరీ, రీడింగ్ కొనసాగిస్తున్నామని చెప్పారు. కరోనాకాలంలో లైబ్రరీని ఆస్పత్రిగా మార్చి కరోనా రోగులకు చికిత్స అందించామని తెలిపారు. ఇంకా.. ట్రస్టు ద్వారా గ్రూప్ వన్, గ్రూప్ టూ, విఆర్ఒ అభ్యర్థులకు ఉచితంగా బోధన అందిస్తున్నామని వివరించారు. చిన్నారులకు ఉచిత కరాటే నేర్పిస్తున్నట్టు చెప్పారు. మల్లు వెంకట నరసింహారెడ్డి మనుమడు, మల్లు లక్ష్మి -నాగార్జునరెడ్డి దంపతుల కుమారుడు డాక్టర్ మల్లు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఈ ఏడాది నుంచి ప్రతి ఏడాది తాతయ్య వర్ధంతి రోజు ఉచితంగా మోకాలి చిప్పల మార్పిడి ఆపరేషన్లు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ ఉచిత క్యాంపును ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మేళ్లచెరువుకు చెందిన వెంకట్‌కు పద్మావతి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచితంగా మోకాలి చిప్ప మార్పిడి చికిత్స నిర్వహించారు. అంతకుముందు ఎంవిఎన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి పుచ్చకాయల నర్సిరెడ్డి, పద్మావతి మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి చైర్మెన్ సూరేపల్లి సత్యనారాయణ, డాక్టర్లు సూరేపల్లి రామ్‌మనోహర్, సంపద, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎండి ప్రదీప్ రెడ్డి

స్టార్టప్స్‌కు ద్వారక కో-వర్కింగ్ స్పేస్

- 620 సీట్లతో మాదాపూర్‌లో సెంటర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆఫీస్ స్పేస్ రంగంలో ఉన్న ద్వారక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టార్టప్స్ కోసం ద్వారక ఫ్రైడ్ పేరుతో నూతన సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 620 సీట్లతో మాదాపూర్‌లో దీనిని ప్రారంభించింది. దీంతో సంస్థ ద్వారా 13 కేంద్రాలకుగాను 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వచ్చింది. మొత్తం 6,500 సీట్ల సామర్థ్యానికి చేరుకున్నామని ద్వారక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండి ఆర్ఎస్ ప్రదీప్ రెడ్డి తెలిపారు. కంపెనీ డైరెక్టర్ డాక్టర్ దీప్నా రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. స్విగ్గీ, తాన్లా, మెడికవర్ హాస్పిటల్స్, ష్నైడర్, రామ్ ఇన్ఫో వంటి 100కు పైగా కంపెనీల కార్యాలయాలు ద్వారక ప్రాజెక్టుల్లో కొలువుదీరాయని చెప్పారు. మెట్రోకు సమీపంలో కార్యాలయాలు ఉండేందుకు క్లయింట్లు మొగ్గుచూపుతుండడంతో ఆ ప్రాంతాలవైపే ఫోకస్ చేస్తున్నామన్నారు. కొత్తగా రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆరు ప్రాజెక్టులను 2024 మార్చినాటికి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. తద్వారా మరో 4,500 సీట్ల సామర్థ్యం అందుబాటులోకి రానుందని చెప్పారు. నుభూతి కల్పిస్తున్నాం' అని వివరించారు.

జాతీయ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు 31 వరకు పొడిగింపు

- ఇంటర్ బోర్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును ఈనెల 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నదని తెలిపారు. సెంట్రల్ సెక్టార్ స్కీం కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవడంతోపాటు పునరుద్ధరణ దరఖాస్తులను ఈనెల 31 వరకు సమర్పించేందుకు అవకాశముందని సూచించారు. సంస్థాగత ధ్రువీకరణ కోసం చివరి తేదీ జనవరి 15 వరకు ఉందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు http://scholarship.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. తాత్కాలికంగా ఎంపికైన 54,458 మంది విద్యార్థుల జాబితాను tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు.

పనిభారం తగ్గించాలని ఆశాల డిమాండ్

- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి
- రాష్ట్ర వ్యాప్తంగా పిహెచ్‌సిల ఎదుట ధర్నా


పిహెచ్‌సి ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పనిభారం తగ్గించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేశారు. పిహెచ్‌సిల ఎదుట నిరసన తెలిపి.. వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఖమ్మం జిల్లా వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారి సుచరితకు అందజేశారు. ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట ధర్నా నిర్వహించి, వినతిపత్రాన్ని మండల వైద్యాధికారులకు అందజేశారు. ముందుగా సిఐటియు కార్యాలయం నుంచి ర్యాలీగా ఆస్పత్రి వరకు చేరుకున్నారు. దుమ్ముగూడెం, ములకలపల్లిలో ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి వైద్యాధికారి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఆశావర్కర్లు నిరసన తెలిపారు. గండిపేట, మియాపూర్, రాజేంద్రనగర్, శంషాబాద్ మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట ఆందోళన చేశారు. తమకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు సోమవారం ఆశా వర్కర్లు సిఐటియు కార్యదర్శి జోషి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం సూపర్‌వైజర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించి, పనిభారం తగ్గించాలని సిఐటియు వనపర్తి జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము అన్నారు. పాన్‌గల్ మండలం కేంద్రంలోని పిహెచ్‌సి దగ్గర ధర్నా నిర్వహించారు.

అనంతరం పిహెచ్‌సి డాక్టర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లకు అదనపు పనికి అదనపు వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం పిహెచ్‌సిలలో వినతిపత్రాలు అందించారు. కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్, భట్టుపెల్లి, నజ్రుల్‌నగర్ పిహెచ్‌సి, కాగజ్‌నగర్ యుహెచ్‌సిలో ఆశా వర్కర్లు వినతిపత్రాలు అందించారు.

విశ్వమానవ సౌభ్రాతృత్వానికి అంబేద్కర్ దిక్సూచి

- ముఖ్యమంత్రి కెసిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్త మానవులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో, పరస్పర గౌరవంతో పరోపకారం ఫరిడవిల్లేలా కలిసిమెలసి జీవించాలనే, వసుధైక కుటుంబ దృక్పథా రాజ్యాంగం ద్వారా పౌర సమాజానికి అందించిన మహనీయుడు డా. బిఆర్ అంబేద్కర్ అని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అన్నారు.

అంబేద్కర్ వర్ధంతి (డిసెంబర్ 6) సందర్భంగా ఆయన జాతికి చేసిన సేవలను సిఎం కెసిఆర్ స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ తాను అనుభవించిన సామాజిక వివక్షను సవాల్‌గా తీసుకుని విజయం సాధించి విశ్వమానవ సౌభ్రాతృత్వానికి దిక్సూచిగా ప్రపంచ మేధావిగా ఎదిగిన అంబేద్కర్ జీవితం సదా ఆచరణీయమైనదనిఅన్నారు. జీవిత పర్యంతం సామాజిక అసమానతల నిర్మూలనకు పోరాడుతూనే, అన్ని వర్గాల వారికి సమన్యాయం జరగాలనే దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్, భారతదేశ అస్తిత్వపు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి మనిషీ ఆత్మగౌరవంతో జీవించాలనే అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం సకల జనుల సాధికారత దిశగా కృషి చేస్తోందన్నారు. తర తరాలుగా సామాజిక ఆర్థిక వివక్షకు గురవుతున్న ఎస్సి కులాల అభ్యున్నతికి కనీవినీ ఎరుగని రీతిలో అమలు చేస్తున్న 'దళితబంధు' పథకానికి ప్రేరణ, స్ఫూర్తి అంబేద్కర్ మహాశయుడేనని అన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ ఏర్పాటుకు కారణమైన అంబేద్కర్ మూర్తిమత్వాన్ని విశ్వానికి చాటే దిశగా తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. తెలంగాణ కొత్త సచివాలయానికి " డా. బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం" అని పేరు పెట్టుకున్నామన్నారు. దేశంలోనే అతిపెద్దదైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర రాజధానిలో ప్రతిష్ఠిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలు, విలువలను అనుసరిస్తూ, దళిత బహుజన పేద వర్గాల అభ్యున్నతికి పాటుపడటమే ఆ మహానుభావునికి మనమిచ్చే అసలైన నివాళి అని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. అదే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని సిఎం అన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం

- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు బిజెపి కుట్రలు
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు


మాట్లాడుతున్న హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిచేసి హుస్నాబాద్ ప్రాంత రైతుల కన్నీళ్లు తుడుస్తామని వైద్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను, జిల్లాలగడ్డలో గ్రామ పంచాయతీ భవనం, మహిళా బిల్డింగ్‌ను సోమవారం ప్రారంభించారు. మహమ్మదాపూర్ గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని బిజెపి అడుగడుగునా అడ్డుకునేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సిఎం కిరణ్ కుమార్‌రెడ్డి ప్రత్యేక రాష్ట్రం వస్తే తెలంగాణలో కరెంటు ఉండదన్నారు. సాధించుకున్న తెలంగాణలో 24 గంటల కరెంటు మనకొచ్చిందని, కిరణ్ కుమార్ రెడ్డి జీవితం మాత్రం చీకటి అయ్యిందన్నారు. తెలంగాణలో మిషన్ భగీరథతో ఇంటింటికి తాగునీటిని అందిస్తున్నామన్నారు. సాధించుకున్న తెలంగాణలో 1.50 లక్షల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. తొమ్మిది వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. తెలంగాణలో రకరకాల ముసుగుల్లో బాణాలు ఎక్కు పెడుతూ ఆంధ్ర పార్టీలు వస్తున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. బిజెపి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఇయ్యకుండా ఉద్యోగాలు రాకుండా చేసిందని అన్నారు. సిఎం కెసిఆర్ లేకపోతే నిధులు, నియామకాలు, రైతుబంధు దక్కునా అని అన్నారు. రైతుల బాయిలకు మీటర్లు పెట్టాలని కేంద్ర ఆర్థిక శాఖ మన రాష్ట్రంలోని ఆర్థిక శాఖకు ఉత్తరం రాసిందన్నారు. బిజెపి నరేంద్ర మోడీ రైతుల బాయిలకాడ మీటర్ పెడితే రూ.600 కోట్లు ఇస్తారట.. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఒప్పు కోలేదని తెలిపారు. కరోనా కష్టకాలంలో అన్నీ బందుపెట్టి రైతుల కోసం రైతుబంధు ఇచ్చిన నాయకుడు కెసిఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల చొప్పున నేటికీ 16 కోట్లు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. మహ్మదాపూర్‌లోని మహాచండీ అమ్మవారికి రూ.పది లక్షల కేటాయించినట్టు తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా 15 రోజుల్లో ఖాతాల్లో వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్ కుమార్, జెడ్‌పి ఛైర్మెన్ రోజాశర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా పరిషత్ రాజారెడ్డి, మున్సిపల్ ఛైర్మెన్ ఆకుల రజిత వెంకన్న, ఎంపిపి మానస, అక్కన్నపేట ఎంపిపి లక్ష్మి, జెడ్‌పిటిసి మంగ, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు వంగ వెంకట్రాంరెడ్డి, సర్పంచులు లతా మహేందర్, పిట్టల సంపత్ ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూజలతో సమస్యలు పరిష్కరిస్తానంటూ మోసాలు

- జ్యోతిష్యుని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పూజలతో వ్యక్తిగతమైన, ఇంట్లో సమస్యలను పరిష్కరిస్తానంటూ జనాన్ని మోసగిస్తున్న జ్యోతిష్యుని హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఎసిపి కెవిఎం ప్రసాద్‌తో కలిసి జాయింట్ సిపి గజారావు మీడియాకు వివరాలె తెలిపారు.

పంజాబ్‌కు చెందిన లలిత్ జాతకాలు చూస్తానంటూ జ్యోతిష్యునిగా ప్రచారం చేసుకున్నాడు. అమాయక ప్రజలను ఎంచుకుని ఆన్‌లైన్‌లో జాతకాల పేరుతో మోసం చేస్తున్నాడు. మూడు నెలల కిందట నగరానికి చెందిన ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో జ్యోతిష్యుడి కోసం ఆరా తీస్తున్న సమయంలో గోపాల్ శాస్త్రి అనే జ్యోతిష్యుని ప్రొఫైల్ చూసింది. అందులో వివరాల మేరకు ఫోన్‌లో సంప్రదించగా సమస్యలు తీరాలంటే పూజలు చేయాలంటూ అతను నమ్మించాడు. అందుకు రూ.32వేలు తీసుకున్నాడు. ఆ తర్వాత మరిన్ని దోషాలున్నాయి, వాటికి సైతం పూజలు చేయాలని చెప్పి రూ.47,11,808 వసూలు చేశాడు. ఇలా వివిధ కారణాలతో పలుమార్లు డబ్బులు వసూళ్లు చేస్తుండటంతో అనుమానం వచ్చిన బాధితురాలు తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేసింది. దాంతో అప్పటి నుంచి అతను ఫోన్ ఎత్తడం లేదు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో సిసిఎస్ పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి విచారించడంతో పలు విషయాలు వెలుగు చూశాయి. నిందితుడి తండ్రి గోపాల శాస్త్రీ జ్యోతిష్యుడు. అతని పేరుతో లలిత్ ఆన్‌లైన్‌లో జ్యోతిష్యుడిలా చలామణి అవుతున్నాడు. లవ్ ఆస్ట్రాలజీ 'గోపాల్ శాస్త్రీ' పేరుతో గూగుల్‌లో యాడ్స్, ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రచారం చేసుకుంటున్నాడు. సమస్యలను పరిష్కరిస్తానంటూ మోసం చేస్తున్నాడని పోలీసులు తేల్చారు. పూజల పేరుతో డబ్బులు దండుకుంటున్నాడు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ హరిభూషణరావు, ఎస్ఐలు పి సురేష్, ఎ శైలేందర్ కుమార్, కానిస్టేబుళ్లు బి రవిశంకర్, మనీష్ తివారీ, ఎ రాము, ఎం సాయికుమార్, వంశీ పాల్గొన్నారు.

అధికారుల ఎదుటే యువరైతు ఆత్మహత్య

- సెల్‌టవర్ ఎక్కి ఉరేసుకొని బలవన్మరణం
- చెరువు నీళ్లు వస్తుండటంతో పంట నష్టపోతుందని మనస్తాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు గోడు పట్టించుకునే వాడే కరువైయ్యాడు. చెరువు కాలువలో నుంచి వెళ్తున్న నీటితో ప్రతేడాదీ తన పంట నీటమునిగి నష్టం వాటిల్లుతుందని, నీరు రాకుండా చర్యలు తీసుకోవాలన్న ఆ యువరైతు ఆవేదనను ఎవరూ పట్టించుకోలేదు. నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలని వేడుకున్నా.. వినిపించుకునే వారు లేకపోయారు. అధికారుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారి.. తీవ్ర మనస్తాపంతో అధికారుల ఎదుటే సెల్‌టవర్ ఎక్కి అందరూ చూస్తుండగానే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ హృదయ విదారక ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం మెంగారం గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెంగారం గ్రామానికి చెందిన పుట్ట ఆంజనేయులు (32) తన సొంత పొలంలో నుంచి గ్రామ సమీపంలోని ఊర చెరువు కాలువ నీళ్లు పోతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నాడు. కొన్నేండ్లుగా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. తన పంటపొలం నుంచి చెరువు నీళ్లు వెళ్లకుండా పనులు చేపట్టాలని, నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలని వేడుకున్నాడు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రతేడాదీ విన్నవించుకున్నా తన సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదని తీవ్ర ఆవేదనకు గురైయ్యాడు. తాజాగా ఆదివారం చెరువు నీటి ఆయకట్టుపై తైబంది నిర్వహించారు. చెరువులో ఉన్న నీటితో 60 ఎకరాలు సాగు చేయొచ్చని, కాలువను శుభ్రం చేసేందుకు రైతుల నుంచి ఎకరాకు రూ.500 వసూలు చేస్తున్నారు. కాలువను మరింత తవ్వితే తన పంట పూర్తిగా మునిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. తన గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని, ఉన్న 20 గుంటల భూమిలో సాగు చేసుకుంటున్నా చెరువు నీటితో నష్టం వాటిల్లుతుందని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దాంతో సోమవారం గ్రామంలో ఉన్న సెల్‌ఫోన్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. దాంతో రెండు గంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు, డీఎస్పీ, ఆర్డీవో అక్కడికి చేరుకొని రైతుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తీవ్ర మనస్థాపానికి గురై అధికారుల, పోలీసుల ఎదుటనే సెల్‌టవర్‌పై ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం పోయిందని గ్రామస్తులు ఆవేదన చెందారు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

జగ్గుస్వామిని అరెస్టు చేయొద్దు

- సిట్‌కు హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల ఎర కేసులో అభియోగాలకు సంబంధించి సిట్ దాఖలు చేసిన కేసులో బిజెపి సీనియర్ నాయకుడు బీఎల్ సంతోష్, కేరళ డాక్టర్ జగ్గుస్వామిని కూడా అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశించింది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) జారీ చేసిన 41ఏ సిఆర్‌పిసి నోటీసులపై స్టే విధించాలంటూ జగ్గుస్వామి కేసు వేసిన విషయం తెలిసిందే. గత విచారణలోనే సంతోష్‌ను అరెస్టు చేయొద్దన్న ఉత్తర్వులను పొడిగిచింది. ఆ రెండు పిటిషన్లను సోమవారం జస్టిస్ సురేందర్ విచారించారు. 41 ఏ నోటసుపై స్టే ఇవ్వడమే కాకుండా సిట్ ఇచ్చిన లుక్‌ఔట్ నోటీసు అమలును కూడా నిలిపివేస్తూ స్టే ఆదేశాలు జారీ చేశారు. 41ఏ నోటీసుపై సమగ్ర విచారణ చేస్తామని చెప్పారు. విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేస్తున్నామనీ, అప్పటి వరకు స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రామచంద్రభారతి, బిడిజెఎస్ అధ్యక్షుడు తుషార్‌కి మధ్యవర్తిగా జగ్గుస్వామి వ్యవహరించినట్టు సిట్ అధికారులు తమ దర్యాప్తులో తేల్చి ఆయనకు 41ఏ నోటీసు జారీ చేసింది. నోటీసులో ఏ వివరాల్లేవని వారి తరపు న్యాయవాదులు చెప్పారు. నోటీసులోనే పూర్తి వివరాలు పొందుపర్చాల్సిన అవసరం లేదంటూ సిట్ వాదించింది.



సెమినార్‌లో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

విఎన్ స్ఫూర్తితో రైతు ఉద్యమాలు

అఖిలభారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విఎన్ స్ఫూర్తితో పాలకులు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని అఖిలభారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ సాయుధ పోరాటయోధులు మల్లు వెంకటనర్సింహారెడ్డి 18వ వర్ధంతిని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో 'బిజెపి ప్రభుత్వ విధానాలు- వ్యవసాయ రంగంపై ప్రభావం" అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చిన ఎనిమిదేండ్ల కాలంలో రైతాంగానికి ఎలాంటి మేలూ చేయలేదని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వ్యవసాయరంగాన్ని వారి చేతుల్లో పెట్టేందుకు యత్నిస్తోందన్నారు. దాంతో సాగు రంగం రోజు రోజుకూ దివాళా తీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, క్రిమీసంహారక మందుల ధరలు ఇష్టమొచ్చినట్టు పెంచి రైతుల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. రైతు పండించిన అన్ని రకాల పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించి, గిట్టుబాటు ధరకు పంటలను కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కల్తీ విత్తనాలు, కల్తీ పురుగుల మందులను పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి కేవలం ఒక్క శాతం మాత్రమే నిధులు కేటాయిస్తున్నారన్నారు. రుణమాఫీని ఏకకాలంలో అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. రైతాంగానికి బ్యాంకు ద్వారా నూటికి 18 రూపాయలు రుణాలు ఇవ్వాల్సి ఉందని, ఆ నిబంధనను బ్యాంకులు అమలు చేయడం లేదన్నారు.

రాష్ట్రంలో అప్పుల బాధతో సంవత్సరానికి సుమారు 640 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 750 మంది విద్యుత్‌షాక్‌తో చనిపోతున్నారని చెప్పారు. సాదా బైనామాల కోసం రాష్ట్రంలో 12 లక్షలు మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే.. రెండు లక్షల మంది రైతులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాస్ పుస్తకాలు ఇచ్చిందన్నారు. అంతకుముందు మల్లు వెంకటనర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళు లర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో జిల్లా కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, బుర్రి శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, ఎలుగూరిగోవింద్, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, పారేపల్లి శేఖర్‌రావు, దండ వెంకటరెడ్డి, జిల్లాపల్లి నర్సింహారావు, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, మేకనపోయిన సైదమ్మ, మద్దెలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గుత్తికోయల బహిష్కరణ రాజ్యాంగ వ్యతిరేకం : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బెండలపాడు గ్రామం నుంచి గుత్తికోయలను బహిష్కరిస్తూ చేసిన తీర్మానం రాజ్యాంగ వ్యతిరేకమని హైకోర్టు చెప్పింది. ఆ గ్రామం నుంచి వారిని బహిష్కరిస్తూ ఛత్తీస్‌గడ్‌కు పంపేయాలన్న తీర్మానాన్ని కొట్టేసింది. గ్రామ పంచాయతీకి అలాంటి అధికారాలుండబోవని జస్టిస్ లలిత జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చంద్రుగొండ మండలం బెండలపాడు పంచాయతీ తీర్మానాన్ని కొట్టేయాలంటూ కె హెడ్మా ఇతరులు వేసిన రిట్‌లో ఈ ఉత్తర్వులు వెలువరించారు.

ఆవుదూడలు ఆగమాగం



- లంపీస్కిన్ బారిన తెల్లజాతి పశువులు
- రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా 66 మృత్యువాత
- అనధికారికంగా వేలల్లో ఉండొచ్చని సమాచారం
- వ్యాధి బారిన 1877 గ్రామాల్లో 8,770 పశువులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మొన్నటి వరకూ మనుషులను వణికించిన కోవిడ్-19 తరహాలోనే పశువులనూ ఐదారు నెలలుగా లంపీస్కిన్ వెంటాడుతోంది. ముఖ్యంగా తెల్లజాతి పశువులకు ఈ వైరస్ ఎక్కువగా సోకుతోంది. అందునా లేగ దూడలకు ఎక్కువగా వస్తున్నట్టు పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో 1,877 గ్రామాల్లో 8,770 పశువులు ఈ వ్యాధి బారిన పడగా అధికారికంగా ఇప్పటి వరకు 66 పశువులు మృతిచెందినట్టు లెక్కలున్నాయి. అత్యధికంగా జోగులాంబ గద్వాల జిల్లాలో 10 పశువులు మృతిచెందాయంటున్నారు. కానీ అనధికారికంగా వందల్లోనే పశువులు మృతిచెంది ఉంటాయని సమాచారం.

చనిపోతున్నా.. మరణించనట్టు..!

ఖమ్మం జిల్లాలో 3,44,930 నల్ల, తెల్లజాతి పశువులుండగా 23 గ్రామాల్లో 27 పశువులకు ఈ వ్యాధి వచ్చిందని, ఒక్క పశువు కూడా మృతి చెందలేదని జిల్లా పశుసంవర్ధకశాఖ గణాంకాలు చెబుతున్నాయి. కానీ తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణిలో ఈ వారంలోనే ఓ పశువు మృతి చెందగా గ్రామంలో సుమారు 10కి పైగా ఆవులు, దూడలు, ఎడ్లు వైరస్‌తో అవస్థపడుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. పక్కనే ఉన్న ఖమ్మం రూరల్ మండలం చింతపల్లిలో 3000 వరకు పశువులుండగా వందకు పైగా వైరస్‌తో ఇబ్బంది పడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

మేకల మశూచి టీకానే దిక్కు...

వ్యాక్సినేషన్ మొదలుపెట్టామని.. మేకల మశూచి టీకానే లంపీస్కిన్ నియంత్రణకు పంపిణీ చేస్తున్నట్టు పశుసంవర్ధకశాఖ చెబుతోంది. రాష్ట్రంలో 68,37,540 పశువులకు వ్యాక్సినేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకూ 44 శాతం అంటే 30,08,572 పశువులకు పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలో వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉన్న పాలేరు, మధిర నియోజకవర్గాల్లో ఇప్పటికే ఒక విడత టీకా వేశామంటున్నా.. వ్యాధి బారిన పడే మూగజీవాల సంఖ్య మాత్రం తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు ఈ వైరస్ ప్రభావం అధికంగా ఉండే ఉత్తర భారతదేశం నుంచి పశువులను దళితబంధు లబ్ధిదారుల కోసం హర్యానా నుంచి తీసుకురావడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. వ్యాధితీవ్రత అంతగా లేని ఆంధ్రప్రదేశ్ పశువులైతే స్థానిక వాతావరణ పరిస్థితులను తట్టుకుంటాయని అంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3.26 లక్షల పశువులకు గాను ఇప్పటి వరకు 1.31లక్షల పశువులకు మాత్రమే వ్యాక్సిన్ అందింది. ఇక్కడ 29 గ్రామాల్లో 25 ఎల్ఎస్‌డీ (లంపీస్కిన్ డిసీజ్) బారిన పడగా ఒక్కటి మాత్రమే మృతిచెందిందని పశుసంవర్ధకశాఖ లెక్కలు చూపుతోంది.

ఒక్కసారిగా విజృంభణ

వాతావరణ అనుకూలతతో లంపీస్కిన్ డిసీజ్ అక్టోబర్ నుంచి విజృంభిస్తోంది. దోమలు, ఈగలు, గోమార్ల ద్వారా సంక్రమించే క్యాప్రిపాక్స్ వైరస్‌కు ప్రస్తుత చలి వాతావరణం కూడా తోడైందని పశు వైద్యాధికారులు తెలిపారు. రాష్ట్రంలో 20శాతం పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని పశుసంవర్ధకశాఖ అంచనా. లంపీస్కిన్ లక్షణాలున్న పశువులున్న గ్రామాలకు 5 కి.మీ పరిధిలోని ఊళ్లలో వ్యాక్సినేషన్ చేస్తున్నామని చెబుతున్నారు. కానీ ఇప్పటికీ ఖమ్మం జిల్లాలో 42శాతం, కొత్తగూడెంలో 40శాతం పశువులకు మాత్రమే టీకాలు అందాయి.

రూ.8వేలు ఖర్చు పెట్టా - కటారి సహదేవ్, చింతపల్లి

నాకు పది శాల్తీల పశువులున్నాయి. రెండు బర్లు, ఎనిమిది ఆవులు, ఎడ్లు ఉండగా వీటిలో మూడింటికి వచ్చింది. రెండింటికి బాగా వస్తే రూ.1,200 గ్లూకోజులు పెట్టించా. ఒక్కోదానికి రూ.నాలుగువేలు పెట్టా. ఓ దూడకు బాగా వచ్చింది. తిరుమలాయపాలెం తీసుకుపోయిన.. మందులు రాసిచ్చారు. కానీ ఒక్క మాత్ర కూడా పశువుల ఆస్పత్రిలో ఇచ్చింది లేదు. దూడకు ఒక్కరోజే రూ.6వేలు పెట్టా. ప్రయివేటుగా వైద్యం చేసేందుకు వచ్చే ఆయనకే విసుగు పుట్టి ఇంక వదిలేయిలే అన్నాడు. నెలరోజుల పాటు రూ.20వేలు పెట్టి వైద్యం చేయిస్తే అంతంతమాత్రంగా తగ్గింది. మావూళ్లో ఆస్పత్రి లేదు. మూడు కి.మీ దూరంలోని తిరుమలాయపాలెమో, ఆరెంపులో, ముత్తగూడెమో, వెంకటాయపాలెమో పోవాలి. ఆటోకు ఎక్కియ్యాలంటే వెయ్యి, పదిహేనొందలకు తక్కువ తీసుకోడు. మా గొడ్లకైతే ఇంత వరకూ వ్యాక్సిన్ వేయలేదు.

ఖమ్మం తీసుకుపోయా - గోవింద నాగయ్య, కొక్కిరేణి

దూడ వయస్సు 10నెలలు. దీనికి బాగా వచ్చింది. జ్వరం బాగా ఉంటుంది. దగ్గు, తుమ్ములు వస్తున్నాయి. తిరుమలాయపాలెం తీసుకుపోయినం. 15 రోజులుగా దీని అవస్థలు చూడలేకపోతున్నాం. ఊళ్లో ఐదారింటికి వచ్చింది.

ఒకటి చచ్చిపోవడంతో భయం వేసి రూ.1500 పెట్టి ట్రాలీ ఆటోలో తీసుకొని వచ్చి ఖమ్మంలో వైద్యం చేయించుకొని వస్తున్నా.

టీకా డ్రైవ్ నిర్వహిస్తున్నాం - డాక్టర్ వేణుమనోహర్, ఖమ్మం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఇటీవల లంపీస్కిన్ బారిన తెల్లజాతిపశువులు, ముఖ్యంగా ఐదునుంచి తొమ్మిదినెలల వయస్సున్న దూడలు ఎక్కువగా ఈ డిసీజ్ బారిన పడుతున్నాయి. ఈ వ్యాధి వచ్చిన పశువులకు తీవ్ర జ్వరం, కంటి నుంచి నీరు కారడం, చర్మంపై పెద్దపెద్ద గడ్డలు, తీవ్రమైన ఒళ్లునొప్పులు, చర్మమంతా పొలుసులుగా మారడం, పశువు మేత తినదు. పాలివ్వదు. ఈ వ్యాధి బారిన పడిన ఆవు పాలు తాగొద్దు. వ్యాధి సోకిన పశువులను మిగిలిన వాటికి దూరంగా ఉంచాలి. గోట్‌పాక్స్ టీకానే దీనికి పంపిణీ చేస్తున్నాం. తెల్ల, నల్లపశువులన్నింటికీ వ్యాక్సిన్ వేస్తున్నాం. కలెక్టర్ చొరవతో మరో లక్ష డోసులు వచ్చాయి. జిల్లాలో 91వేల తెల్లపశువులకే ఇప్పటి వరకూ చేశాం. నల్లవాటికి కూడా ఇప్పుడు చేస్తున్నాం.